# కఠిన శిక్ష

"ఒచ్చావా నాయనా, రా ! నా నెత్తిని పాలుపోసేవు. నీకోసం పొద్దుట్నించీ టవునంతా వెతికింపిస్తున్నాను !" అన్నాడు తాసీల్దార్ రామారావు రివిన్యూ ఇన్‌స్పెక్టర్ వాసుదేవరావు కన బడగానే.

"సారీ సార్! చంగల్రావుపేటలో వొక రూమ్ ఉందం టేనూ. పోనీ ఆఫీసుకి దగ్గరగా వుంటుంది కదాని, ఎల్లా వుందో చూద్దాం అని వెళ్ళానండి."

"సరే,సరేలేవయ్యా! నువ్వు రూమ్ వెతుక్కొనిఅందులో దిగి సెటిలయ్యే లోపున బోర్డు మెంబరు రానూ వొస్తాడు. నా వుద్యోగం కాస్తా వూడపీకి వెళ్ళనూ వెళ్తాడు !.... ఎక్కడున్నావో, ఏవుద్యోగం చేస్తున్నావో గుర్తుంచుకొని, కాస్త వొళ్ళు దగ్గిర పెట్టుకుని మరీ వస్తూవుండు !"

"బోర్డు మెంబరు వస్తున్నారండీ ! ఎవరు సార్ ?"

"ఎవరో అయితే మన కెందుకింత వొణుకు ? యమ్-సిక్స్ గారే ! ఆయనగారు అసలే ఉగ్ర నరసింహ ! .... మధ్యాన్నం

ఫ్లయిట్‌లో దిగుతాట్ట భువనేశ్వరం నించి! తెల్లవారేసరికి పిడుగులా వొచ్చి పడ్డాది టెలిగ్రాం .... నువ్వేమో యన్జీవో హోమ్‌లో లేవు. హోటల్లో లేవు. కలెక్టరాఫీసులో లేవు; తాలూకాఫీసులో నీ పత్తాపే లేదు; ఇదుగో. చూడు ఆచారీ - వెధవది ఆచారి అనే వొస్తుందెంత సేపూను - నీపేరు వాసుదేవరావు కదూ - వాసుదేవరావ్! హెడ్‌క్వార్టర్స్ రెవిన్యూ ఇన్‌స్పెక్టరు ఇలాగుంటే మేం ఉద్యోగాలు చెయ్యలేమయ్యా! .... పనున్నా లేకపోయినా? బతికున్నా చచ్చినా సరే. హెడ్‌క్వార్టర్స్ ఆరై అంటే తాలూకా తాసిల్దార్ దగ్గిర - పోనీ తాసిల్దార్ సిగ్గోసిరి, వాడి దగ్గిర కాపోతే తాలూకాఫీసు దగ్గిరేనా సరే — ఇరవైనాల్గుగంటలూ తైనాతీ ఉండవలసిందే! మనకేదైనా పనుంటే ఏది, మన స్వంత పనులు - రూమ్ చూసుకోడమనీ, భోజనం చెయ్యడమనీ ఇలాంటివి - ఇరవైనాలుగ్గంటలూ అయిపోయాక ఇరవయ్యయిదో గంటల్లో చేసుకోవాలంతే! తెలిసిందా? .... సరే వొచ్చేవుకదా. అదే పదివేలు! తొరగా గెస్ట్‌హౌస్‌కి దయచెయ్. నువ్వూ నా ప్యూను బంగారీ అక్కడుండండి! నేను జీపూ, స్టేట్ కారూ తీసుకుని ఏర్‌పోర్టు కెళ్ళి వార్ని రిసీవ్ చేసుకుని అక్కణ్ణించిలా తీసుకొచ్చేస్తాను ... నాతో ఒక ప్యూనుంటాడు.... నీ ప్యూన్ని సాయంకాలం ఆర్లోపల గెస్టుహౌస్ దగ్గిర హాజరవమనీ, వాడు రాత్తిరి నైడ్యూటీ కక్కడే వుండిపోవాలనీ కబురెట్టు!"

"గెస్టుహౌస్ —"

"గెస్టుహౌసుకూడా యరగవు నువ్వు .... కాని నీకూడా గెస్టుహౌసుకొచ్చి చూపించడానికి నాకిప్పు డోపికా లేదు. టైమంతకన్నా లేదు! చచ్చీ చెడీ రూమ్ రిజర్వ్ చేయించే నెలాగో. ఇంకా నువ్వు డిలే చేస్తూ కూచోక వేగిరం అక్కడి కెళ్ళిపోయి అక్కడన్నీ తిన్నగా ఉన్నాయో లేదో చూడు. నేనలా ఆయన్తో వొచ్చేస్తాను!"

"అలాగే సార్" అని ఇవతల పడ్డాడు వాసుదేవరావు. కాని అతను ఆ మాట అని గుమ్మం దాటీ దాటగానే మళ్ళీబెల్ నొక్కేడు తాసిల్దార్. ఆ శబ్దంమీద నమ్మకంలేని వాళ్ళాగ "ఓయ్ వాసుదేవ రావూ!" అని స్వయంగానే కేకేశాడు.

"ఆయి -" అంటూ మళ్ళీ కంగారుగా తాసిల్దార్ రూమ్‌లో కెళ్ళాడు వాసుదేవరావు.

తాసిల్దార్ రామారావు కుర్చీలో వెనక్కి చారబడి, టేబిలు కింది అడ్డచెక్కమీద కాళ్ళుపెట్టి తమాషాగా వూగుతూ అన్నాడు; "అదికాదూ, బోర్డు మెంబరు వొస్తున్నాడయ్యా అని నేన్చెబితేనూ నీకు చీమకుట్టినట్టయినా లేదేమిటి? కొన్నాళ్ళు నువ్వు బోర్డాఫీసులో పన్చెయ్యడం కాదుగాని, నా పీకలమీదికి తెచ్చేటట్టున్నావయ్యా నువ్వు! .... అక్కెడికెళ్ళేక మళ్ళీమీ సాబ్ - భాయీ పిలుపులు పిల్చుకుందురుగాన్లేగానీ, నువ్వు ఇవాళ ఇక్కడున్నావన్న సంగతి మర్చిపోకు! .... నువ్వివాళ రెవిన్యూ బోర్డాఫీసులో అప్పర్ డివిజన్ గుమాస్తావికాదు. జిల్లా హెడ్ క్వార్టర్స్‌లో టవునార్రైవి! తెలిసిందా? బంగళాకి వెళ్ళవయ్యా.... అంటే గంగిరెద్దులా బుఱ్ఱూపిసి వెళ్ళిపోతున్నావు. టైమేమో మూడున్నరయి పోతున్నాది. ఇంకో గంటలో ఆయనగారు దిగబడతాడు. గెస్టుహౌసుకెళ్ళే రెవిన్యూ ఇన్స్పెక్టరు మొగ పెళ్ళివార్లా చేతులూపుకుంటూ వెళ్ళిపోవడం నా సర్వీసులో ఎక్కడా చూళ్ళేదయ్యా నిన్ను తప్ప; .... ఇటు చూడు; నాలుగు రకాల పళ్ళూ బజార్నించి కొని పట్టుకెళ్ళాలి.గెస్టు హౌస్ కిచెన్లో కాఫీ ఉన్నాదో లేదో కనుక్కొని, లేకపోతే అప్సరా హోటల్నించి పెద్ద ఫ్లాస్కు నిండా బోర్న్‌విటా, చిన్న ఫ్లాస్కు నిండా కాఫీ తెప్పించి రడీగా వుండాలి; హాట్ వాటర్ సిస్టమ్ సరిగ్గా ఉందో లేదో చెకప్ చెయ్యాలి. ఆ వాచ్మేన్‌గాడు దుప్పట్లూ, దోమ

తెరా, తలగడా, గలీబులూ మార్చే నంటాడు; నిజంగా మార్చేడా లేదా అన్నది చూసుకోవాలి .... బాత్రూమ్ మాత్రం శుభ్రంగా డిట్టాల్ పోయించి దగ్గిరుండి క్లీన్ చేయించాలి .... తెలిసిందా.... నీవేషమేమిటి అలావుండి. మొగుడు కొట్టేడా మొహం తీరే అంతా అన్నట్టు ? తోవలో ఎక్కడైనా వో అయిదు నిమిషాలాగి గెడ్డం గీయించుకుని మరీ వెళ్ళు. అపావలా కావాలిస్తే నేనిచ్చేస్తానుగాని .... వస్తోవనిగా ఆ చొక్కాకూడా మార్చుకుని మరీ తగలడు !"

"వెళ్ళొస్తానండి" అనికూడా అనాలనిపించలేదు ఎందుకో గాని - వాసుదేవరావుకి,

మర్నాడు ఉదయం 8-30 గంటల వేళప్పుడు 'కఠినశిక్ష!' 108వ సారి జపించుకుంటూ గెస్టుహౌసు వరండామీద కూర్చొనున్నాడు వాసుదేవరావు.

* * *

గెస్టుహౌసు ఐదో నెంబరు రూమ్‌లో రెవిన్యూబోర్డు అరో మెంబరుగారు నిన్న సాయంకాలం దిగేరు. వార్ని చూడ్డానికి ఆర్. డి. ఓ. గారు. జాయింటు కలెక్టర్ గారు, కలెక్టరుగారు నిన్న రాత్రి వచ్చారు. ఇవాళ పొద్దుటా వచ్చారు. వారేకాక పలువురు పెద్దలు, అధికారులు, అనధికారులు, పురప్రముఖులు వస్తున్నారు. వెళ్తున్నారు .... ఎడా తెరిపీ లేకుండా కాగితాలు చూస్తున్నారు మెంబరుగారు.

గడీకోమాట కాఫీలో, బోర్నవిటాలో, సిగరెట్లో, బిస్కెట్లో— ఏదో వొకటి తెమ్మని చెప్పడానికి తప్ప వాసుదేవరావు ఉనికిని గుర్తించిన వారే లేరక్కడ.

నిన్న సాయంకాలం నుంచి మహా యజ్ఞం సాగుతూనే వుంది —ఆరు కప్పుల బోర్న్‌విటా, నాలుగు కాఫీ-లవండర్‌డ్యూ సబ్బు-

అరడజను ఏపిల్సు-డజనున్నర బత్తాయి - డజను చక్కెర కేళీలు - రెండు ట్రిబిల్ ఫైవ్ సిగరెట్ పెట్టెలు -

రాత్రి లగ్జూరియస్ డిన్నర్ –

ఇవాళుదయం-ఇప్పటికి! పది కప్పుల బోర్న్‌విటా, ఎనిమిది కాఫీ -

వెస్టర్న్‌స్టయిల్ బ్రేక్‌ఫాస్ట్ ముగ్గురికి -

రెండు ట్రిబిల్ ఫైవ్ సిగరెట్ పెట్టెలు —

వెళ్ళిపోతార్ట - అంటే బంగళా అద్దె, వాచ్‌మెన్ మామూలు ఇచ్చేసి రిజిష్టర్ క్లోజ్ చెయ్యడంకూడా అయిపోయింది —

హైదరాబాద్ వెళ్ళే ఎక్స్‌ప్రెస్ ట్రెయిన్ అరగంట లేటుట. — స్టేషన్‌కి ఫోన్‌చేస్తే చెప్పేరు.

ఇంకో పావు గంటలో నో, అరగంటలోనో బయల్దేరిపోతారుట-

'టైమ్ ఈజ్ వేస్టాఫ్ మనీ.'

ఇంకా ఏం తెమ్మంటారోనని బెంగగా, బెంగ హింసగా, హింస అసహ్యంగా .... అసహ్యం అవమానకరంగా వుంది ....

కఠినశిక్ష ;

ఆరేళ్ళు బోర్డాఫ్ రెవిన్యూ ఆఫీసులో పనిచేసే డతను .... రెండో యాడాది నించీ మొదలు పరీక్షలు;

మూడు రెవిన్యూ టెస్టులు —

రెండు ఎకవుంట్సు టెస్టులు —

క్రిమినల్ జుడిషియల్ టెస్టులు -

సర్వే ట్రయినింగు - ఫైనల్ ఎగ్జామినేషన్ -

ఏ పరీక్షా ఇంత కఠినంగా వున్నట్టనిపించలేదు.

ఇన్నీ అయినా. 'రెవిన్యూ ఇన్‌స్పెక్టరుగా రెండేళ్ళుచేస్తేనే గాని ప్రమోషన్‌లే' దన్నారు - అదీ కష్టమనిపించలేదు -

కృష్ణాజిల్లా వ్యక్తిని. హైదరాబాదులో ఉద్యోగంలో వున్న వాణ్ణి. ఈ రెవిన్యూ ఇన్‌స్పెక్టర్ ఉద్యోగం కోసం - విశాఖపట్టం వంపించేరు.

అదీ ఇబ్బందనిపించలేదు -

'టవున్ ఆఫైరెగా వేసేరా ? అయ్యో పాపం;' అని జాలి పడ్డారందరూను

'ఎక్కడైతేనేం సార్ ? కళ్ళుమూసుకుని ఈ రెండేళ్ళూ ఎట్లాగో గడిపేస్తేమళ్లీ బోర్డాఫీస్ కెళ్ళిపోవచ్చు;' అని సానుభూతిని స్వీకరిస్తూనే సవాలును ఎదుర్కొన్నాడు.

ఛార్జీ పుచ్చుకోకముందే, పద, ఆర్డీవోతో క్యాంపు కన్నారు....

ఎక్కడో వో పల్లెటూళ్ళో వో కొండ. నిజానికి కొండ రెండూళ్ళ భూమిలో ఉంది. రెండూళ్ళ వాళ్ళూ కొండనించి రాయి కొట్టుకుంటున్నారు. ఉన్నట్టుండి తగాదా బైల్దేరింది — అవతలి వూరువాళ్ళు మావూరి వేపు రాయి కొట్టేస్తున్నారంటే, అవతలి వూరు వాళ్ళు మా వూరే కొల్లగొట్టేస్తున్నారంటూను.

డ్యూటీ ....

రెండో రోజున కుష్ఠురోగుల సంఘం ప్రెసిడెంటుగారొచ్చారు వ్యాధి పీడితుల కాలనీకి ప్రభుత్వం వారివ్వబోతున్న జాగా టవునుకి మరీ దూరంగా వుంది; అక్కణ్నించి వాళ్ళు ఊళ్ళోకి ముష్టెత్తు

కుందికి ఒచ్చీ లోపునే వాళ్ళ ప్రాణాలు పోతాయని వారన్నారు. కుష్టురోగుల కాలనీ ఊరి నడి మధ్యని పెట్టడానికి వీల్లేదంటూ హెల్థాఫీసర్ రికమెండెషన్‌తో రేటుపేయర్ల సంఘం తరఫునొచ్చిన వ్యక్తివాదన, తాసీల్దార్‌తో ఇనస్పెక్షన్.

డ్యూటీయే —

మూడో రోజున ఎక్కణ్ణుం చెక్కడికో వెయ్యబోయే కరువు నివారణ రోడ్డు స్వరూప స్వభావాలు - కలెక్టరుగారిచే ఇన్‌స్పెక్షన్. అ రోడ్డుకి ఇరువైపులా యెనిమిది గ్రామాలు. ఆగ్రామాల రైతులనీ, కలెక్టరు వారి దర్శనానికి సిద్ధం చేయించడం మొరలూ, అర్జీలూ పెట్టించడం - డ్యూటీయేగా, మరి !

నాలుగోరోజు - ఉదయం దొండపర్తి అవతల తాటిచెట్ల పాలెంలో యిళ్ళు కాలిపోయేయి. మధ్యాహ్నం పెందుర్తి దగ్గిరేదో వాగు పొంగి ఇళ్ళలోకి నీళ్ళొచ్చేసేయి.

కొంపలంటుకున్నా డ్యూటీ తప్పదు; కొంపలు మునిగిపోయినా డ్యూటీ తప్పదు !

నష్టా లంచనా వెయ్యడం, పేర్లు రాసుకోడం, ప్రభుత్వం వారు తక్షణ రక్షణగా యిచ్చే పరిహారాన్ని సక్రమమైన రసీదులు తీసుకుని పంచిపెట్టడం -

డ్యూటీలే - కాదంటే యెలా ?

ఐదో రోజు - అనగా మొన్న - ఎక్కడా ఏ ఉపద్రవమూ లేదుకదా. ఆదివారంకూడా కదా, ఎక్కడేనా ఓ గది చూసుకుని ఈ యన్ జీవో హోమ్ "భూతల శయనంబు"కు స్వస్తి చెబుదాం అనుకుంటూ బయలుదేరుతూ వుండగానే -

కలెక్టర్‌గారి బంగాళా నుంచి కబురు -

ఎనిమిదిన్నరకి బంగళాకి చేరితే - పదిన్నర దాకా ఎందుకు రమ్మన్నారో శెలవిచ్చిన దాతలు లేరు.

చివరికి -

మర్నాడు సోమవారం కదా, కలెక్టరుగారి సతీమణి శివార్చన చేస్తారని; అష్టోత్తర శతనామావళి అర్చన నాగమల్లి (నాగలింగ) పుష్పాలతో చేయడానికి సంకల్పించారని -

అందుకోసం, నూట ఎనిమిదికి తక్కువ లేకుండా నాగమల్లి పువ్వులు కావాలని -

ఉదయం ఆరున్నర కల్లా కలెక్టరుగారి సతీమణి స్నానాదికం పూర్తిచేస్తారు కనుక ఆ పువ్వులు ఆ వేళటప్పటికి బంగాళాకి చేరాలని ....

అవి ఆ రోజు అప్పుడే కోసిన పువ్వులుగా ఉండాలని ....

పురమాయించారు.

డ్యూటీ కాకపోవచ్చు కానీ అక్కడెవరికీ ఆసంగతి పట్టినట్టు గానీ, కనీసం తట్టినట్టుగాని లేదు. "తత్తదఖిలమ్, శంభో తవా రాధనమ్" అని అనుకొని, అలాగే సార్ - అన్నాడు, కలెక్టర్‌గారి క్యాంపు క్లార్క్‌తో.

నాగలింగ పుష్పాలకోసం కాంభోజరాజు కథలో శరాబంది రాజులాగ బయలుదేరి విశాఖపట్నం చుట్టూవున్న సప్త సముద్రాలు- [సనెన్‌సీ సముద్రం, రామకృష్ణ మఠ సముద్రం, కోస్టల్ బ్యాటరీ సముద్రం, జాలరిపేట సముద్రం, అగ్రహారం సముద్రం, టవున్‌హాల్ సముద్రం, ఇన్నర్ హార్బర్ సముద్రం-ఈ ఏడున్నూ విశాఖపట్నం వద్దగల బంగాళాఖాతమనే మహా సముద్రమునకు ముద్రవేయని ఉప సముద్రముల పేర్లు] వెతగ్గా- నాగలింగవృక్షం

ఒకటి సాయకాలం అయిదు గంటల ప్రాంతంలో, కనుక్కోబడ్డాది. ఆ చెట్టుగల ఆసామీ— పుష్పాలు కావలసింది రెవిన్యూ ఇన్‌స్పెక్టరు గారింట్లో పూజకి కాదు; కలెక్టరు గారింట్లో పూజకేనని తెలుసుకొన్న వాడై. వారు 'కోరినన్ని' పుష్పాలు స్పేర్ చెయ్యడానికి రిలక్టంటు గానే అంగీకరించినా, ఉదయం ఏడు దాటితేగాని మాగేటు మాత్రం తెరవం అని అరవంలో చెప్పేడు. అయ్యోర్నాయన, నాయన్నాయన, చచ్చినా నీకడుపున పుట్టం, కావాలంటే పాతిక కేజీల పంచదార పెర్మిటు నీదగ్గర్నుంచి అప్లికేషన్ లేకుండాతెచ్చి దాఖల్ చేసుకుంటాం; ఈ చెట్టు రేపటి రేపటివేళ పూసే పూలలో నూటఎనిమిది పూలు మాత్రం మీ బంటునిచ్చి మాదొరసానికి రేపు ఆరుగంటలు దాటకుండా పంపుమీ అని ప్రార్థించి ప్రసన్నుణ్ణి చేసు కోవడమైంది, ఎలాగైతేనేమి—

డ్యూటీ కాకపోతేనేం-మూడు డ్యూటీల్నర కష్టం పట్టింది-

ఆరోరోజు - యమ్ సిక్స్ గారుదిగేరుగా;

ఇవాళ ఏడోరోజు-

హైదరాబాదునుంచి విశాఖపట్నం ట్రాన్స్‌ఫరుకదా అని - ఆరు వందల రూపాయలు ఎడ్వాన్స్ తీసుకున్నాడు....ఇంటిదగ్గర కొంత యిచ్చి, టిక్కెట్ కొనుక్కుని - ఈ ఐదురోజులు పెట్టిన ఖర్చంతా వొకయెత్తూ, నిన్నసాయంకాలంనుంచి ఇప్పటిదాకా వొక యెత్తూనూ.

నిల్ బేలన్స్?

ఏదైనా తెమ్మంటే ఏంచెయ్యాలి?-అని బెంగెట్టుకుంటూ, ఇబ్బంది పడకండా వాళ్ళు అడిగింది తెచ్చివ్వగలిగేటంత మాత్రం

డబ్బు తన దగ్గరలేనందుకు-పాపం చేసిన వాడిలా చింత, హింస, అవమానం అనుభవిస్తున్నాడు వాసుదేవరావు.

ఈ ఒక్క కేంపూ యెలాగైనా దాటించు భగవంతుడా ఇక మీదట ఇంకా జాగర్తగా ఉంటాను అని మొరెట్టుకుంటున్నాడు.

* * *

"బిల్ తెమ్మంటున్నాడోయ్ దొర!" అని గొణుగుతూ యివతలికొచ్చాడు తాసిల్దార్.

ఏదో-తెమ్మంటున్నాడు దొర-అని అర్థమైపోయింది వాసు దేవరావుకి.

ఎదలో ముల్లు దిగి గుండె జల్లుమనడం, బిక్కమొహంలో చక్కగా అవుపడ్డాది.

"రెడీ చెయ్యలేదా? ఏమిటలా వెర్రిమొహం వేసుకుచూస్తావు? బిల్లయ్యా బిల్లు? డబ్బు కర్చవడం లేదూ నిన్నట్నుంచి?"

"అయి."

"మరి బిల్లేదీ అంట?"

చక చకా వేసేడు బిల్లు,వాసుదేవరావు. అనుభవంగల హోటల్ బేరర్లాగ. తాసిల్దార్ కొంచెం దూరంగా వెళ్ళి దమ్ము కొట్టుకొచ్చే సరికి పూర్తయింది.

టకటకా వచ్చి బిల్లందుకొని లోపలి కెళ్ళిపోయాడు. తాసిల్దార్. వెంటనే ఎకౌంటు లేని వాడిచ్చిన చెక్కులాగ వెనక్కొచ్చే సేడు కూడానూ. "ఇదేమిటోయ్. నీకేమైనా మతున్నదా? ఈ బిల్లేమిటి, ఇలావేసేవు? దీనిమీదలాభంసంపాదిద్దామనా,నీప్రయత్నం?" అని ఆ కాగితాన్ని వాసుదేవరావు మొహాన కొట్టాడు.

"రామ రామ! పిల్లల సాక్షి సార్. నయాపైసల్తో సాహా ఖర్చయిందే రాశాను;"

"అయితే వొక్కరోజుకే యాభైతొమ్మిది రూపాయల ఎనభయ్యయిదు పైసలైందంటావుటయ్యా?"

"ఒక్కరోజేమండీ నిన్నా ఇవ్వాళ-"

"ఏడ్చావులే ఆయనొచ్చి ఇరవైనాలుగ్గంటలైనా కాలేదు; నువ్వు రెండ్రోజులకి లెక్క చెబ్తున్నావు;"

"అయి-"

"ఇదంతా ఆయన ఇస్తాడనే వేశావా?"

"ఇస్తాడని నేను అనుకోనే లేదాసర్, నిజానికి! అందుకే తమరు వెయ్యమనేదాకా బిల్ వెయ్యనేలేదు;''

''షటప్?....అ స్సరేలేవయ్యా. వెధవ కొత్తా నువ్వూనూ;.... తొరగా ఇంకో కాయితం తీసుకుని. ఇలాకాకుండా ఏదో - ఆయనకి కష్టం లేకుండా చూశావుకదు'....తెల్సిందా? .... త్వరగా; ఆయన మళ్ళా పిలుస్తాడు;'

వాసుదేవరావుకి అర్ధమైందిగాని వెంటనే దిక్కుతోచలేదు. వేరే కాగితం తీసుకుని, మరో బిల్లువేశాడు. ఐటం ఐటంకి ఖర్చు తగ్గించుకుంటూ పోతే పెద్ద మిగులు కనబడలేదు....మళ్ళీ ఇంకో కాగితం, తీసి కొన్ని ఐటమ్స్ వదిలేసి వేసేసరికి పని సుళువుగా తెమిలిపోయింది—

''ఎంతా?....పధ్నాలుగు-నలభై ఐదు.... పర్లేదు-కదూ?;' అని మిస్చీవస్‌గా చూసేడు తాసిల్దార్.

కబురొచ్చినప్పుడు లోపలికెళ్ళి, తన పై అధికారుల పై అధి

కారి ''ఈ వూళ్ళో కాస్టాఫ్ లివింగ్ చాలా తక్కువే;" అని ఆనందించి నప్పుడు వాసుదేవరావు ఆయన ఆనందాన్ని ఆయనతో పంచుకో లేనంత అధమాధమ మనఃస్థితికి దిగజారిపోయి నట్టు కనిపించాడు. అధికారులందరూ హీ హీకారాలుచేసినా అతనిమనస్సు హాహాకారాలే చేసింది—

వారిచ్చిన పదిహేను రూపాయలూ తీసుకోగలిగాడు; కాని. 'డోన్ట్‌బాదర్ ఫర్ ది ఛేన్జ్' అన్నవాక్యంతో వారు ప్రసరించిన చూపును మాత్రం వాసుదేవరావు భరించలేకపోయాడు.

నక్క, సింహానికి మంత్రయిపోయి పులి వేపు అవమానిస్తూ చూసినట్టనిపించిం దతనికి.

యాభై అయిదు పైసలు....ఇచ్చేస్తే ఆ అవమానం తగ్గు తుందని అనిపించింది. కానీలేవు.

* * *

శ్రీవారికి నమస్కారములు.

ఇవాల్టికి ఆరునెల లయింది. మీరు విశాఖపట్నంలో డ్యూటీలో జాయినై. ఈ ఆరునెలల్లో మీరునాకు రాసినవి రెండే రెండు ఉత్తరాలు. రెండుత్తరాలూ మీరు డబ్బుకోసమే రాయక పోయినా డబ్బు పంపమని మీరు రెండిట్లోను రాశారు.

''దేశంలో ఎంతోమంది ఉద్యోగస్తులు వున్నారు. అందరికి ఉన్నూళ్ళల్లో ఉద్యోగాలు దొరకవు. అంతమాత్రంచేత పొరు గూళ్ళల్లో ఉద్యోగాలు చేసేవాళ్ళందరూ మీకు మల్లేనే ఉంటు న్నారా? పని తీరలేదన్నారు. బాగానే ఉంది ఇల్లు దొరకలేదన్నారు. అదీ బాగానే ఉంది. కాని, వచ్చేజీతం అంతా మీ ఒక్కరికే చాల నప్పుడు, ఆడదాన్ని నేను ఇద్దరు పిల్లలతో ఏ విధమైన ఆదాయం

లేకుండా ఎట్లా బ్రతుకుతానని అనుకున్నారు? పైగా మీకు నేను డబ్బులు పంపటం వొకటా? ఎవరైనా వింటే నవ్విపోతారు;

"క్రితంసారి మీకు నూటయాభై పంపమని వ్రాశారు. నాదొకటి మీదొకటి వుంగరాలు తాకట్టెట్టి పంపాను. ఈ సారి మీరు మూడువందలు పంపమని వ్రాశారు. మళ్ళీ అప్పట్లాగానే ఏదయినా వస్తువు తాకట్టు పెడితే మాత్రం విడిపించుకునే అవకాశం ఉంటుందో ఉండదో నాకర్థం గాలా. అందుకని నాగొలుసు అమ్మేసి ఎనిమిది వందలడెబ్భయి రూపాయలు తీసుకున్నాను. ఉంగరాలు విడిపించటానికి నూటఅరవై రెండు రూపాయలైంది. మీరు మూడువందలు పంపమన్నారు. కాని నేను నాలుగు వందలు పంపుతున్నాను. మీ సొమ్ము మీకు పంపటానికి నాకే మభ్యంతరం?

"టి. యమ్. ఓ. కనక డబ్బు ఇంతకుముందే అంది ఉంటుంది. ఈ ఉత్తరం అందిన వెంటనే మీరు తీరిక చేసుకుని నాలుగు వీధులూ తిరిగి ఒక చిన్న ఇల్లు, ఎంత చిన్నదయినాసరే, ఆఖరుకు వొక్కరూమైనాసరే సంపాదించండి. అందరము ఒక్క దగ్గరనే పడివుందాము.

"ఏడేళ్ళవ్వస్తూంది. నేను మీ ఇంటి కోడలినై. ఒక్కసారి కూడా మీరు నాకు అన్యాయం చెయ్యలేదు; ఒక్కరోజున కూడా నన్ను మీరు అవమానపరచలేదు. ఎప్పటికప్పుడు నా అదృష్టానికి పొంగి పోవటం తప్ప వేరే రకం ఆలోచన్లే లేవు నాకు. ఇప్పుడీ ఆరునెలల్లో మీరు అవలంభించిన ధోరణి చూస్తూ ఉంటే-చదువులో గాని, లోకానుభవంలోగాని మీకు సమానమైన వ్యక్తినే అయినప్పటికీ ఎందుకో చాలాభయం, కొంచెం ఆగ్రహం కలుగుతూ ఉన్నాయి.

'నాకు తెలిసినంతవరకు మీరు అబద్ధాలు చెప్పరు. సాటి మని

షిని మోసంచెయ్యడం, అగౌరవపర్చడముమీ కెంత అసహ్యమో నే నెరుగుదును. చేస్తే ఒకరికి ఉపకారంచేస్తారు. లేకపోతే చాతకాదని చెప్తారు. కాని ఉపకారంలోంచి డబ్బు, అశక్తతలోనుంచి అపకీర్తి తెచ్చుకోటానికి అంగీకరించరు. అట్లాంటి మీకు, ఈ ఆరు నెలల నుంచి ఏ దుష్టగ్రహం పట్టింది? మిమ్మల్ని పీడిస్తున్న వ్యసనం ఏమిటి? మీకు కలిగిన బాధలు ఎల్లాంటివి? అవన్నీ తెలుసుకోవాలనే కోర్కె కంటె వాటిని మీతోబాటు అనుభవించాలని, ఎదుర్కోవాలని అనిపిస్తూవుంది. నాకోర్కె న్యాయమైనదైతే నాకు అవకాశం యివ్వండి.

'మీ మీది ప్రేమచేత ఇంతకంటె కటువుగా వ్రాయలేకపోతు న్నాను. స్కూలు మూసేశారు. వేసవికి పాప బడికెళ్ళే పనిలేదు. అందుకని పైగా ఇంక ఇక్కడ ఉండాలనిపించక, ఉండలేక నేను ఇవ్వాళే ఇంటికి తాళం పెట్టేసి వుయ్యూరికి వెళ్ళిపోతున్నాను పిల్ల లనుతీసుకొని. మీకు భార్య, బిడ్డలు, డబ్బు, అభిమానం, సాను భూతి-ఏది కావలసినా మా నాన్నగారి పేరిట వ్రాయండి....

మీ, సులోచన.'

* * *

నూకరాజు నవ్వేడు వాసుదేవరావు చెప్పింది విని.

అసలైన రాజకీయ చైతన్యం వున్న జిల్లాలో పుట్టి- నువ్వె క్కడ దొరికావయ్యా బాబూ; గవర్నమెంటు సర్వీసంటే టూ- వే ట్రాఫిక్కని తెలుసుకోలేక పోయావు. ఇంకెందుకు పనికొస్తావు?.

ఎలా మనవి చేసుకోవాలో అర్థం కాలేదు వాసుదేవరావుకి-

ఎంతసేపూ వెళ్ళు, ఆ పని చెయ్యి, ఈ పనిచెయ్యి-అక్కడ ఆ సప్లయ్‌లు చూడు; ఇక్కడి ఏర్పాట్లు చెయ్యి- అంటూ కొంపలు

మునిగిపోయినట్లు అన్నీ అర్జెంటేనంటూ ఆర్డర్సు జారీచేసే తన డిపార్టుమెంట్ అధికార్లకి-

లాభంలేని సెట్టి ఏట్లోపడతాడా ? టవునార్డైగా వేసినప్పుడే సరదాగా జాయినైపోయిన పెద్దమనిషి ఆ పోస్ట్లోని లోతుపాతులు కష్ట నిష్ఠూరాలు తెలుసుకోకుండానే చేరాడా? వాడి తిప్పలు వాడే పడతాడు!- అని పెదవి విరిచే తన సహాధ్యాయులకి—

తను అర్నెల్లనించి సుఖశాంతుల్లేక, విశ్రాంతిలేక బ్రతుకుతున్నాడని- చివరికి తను కష్టపడి సంపాదించుకున్న జీతంకూడా తన జేబులోకి వెళ్తుందన్న హామీ లేక భయపడుతున్నాడని-భార్య ద్వారా అమ్మించుకున్న అయిదుతులాల బంగారం పోగొట్టుకుని, పదిహేను వందల రూపాయలకు ప్రోనోట్లు వ్రాసి ఆర్థికంగా అట్టడుక్కి దిగిపోతున్నాడని—

ఎలా మనవి చేసుకోవాలో అర్ధంకాలేదు వాసుదేవరావుకి—

ఇది టూ-వే ట్రాఫిక్కన్న విషయంకూడా అతనునమ్మలేదు,

ఎవడో మన దగ్గిరికొక ఉపకారంకోసం వస్తాడు. చేస్తాము-చెయ్యము. చేస్తే వాడు థాంక్సంటాడు. చెయ్యకపోతే, వాడుకాదు మనమే సారీ అనాలి. ఇక్కడ ఈ థాంక్స్ కేష్ చేసుకుని, ఎవడో ఈ వూరికి డ్యూటీమీద గవర్నమెంటిచ్చే అలవెన్సులు తీసుకొని కాంపొచ్చినప్పుడు వాడికి సప్లయ్‌లు చేసి; ఎవడో ఈ వూళ్ళో నిశ్చింతగా వాడి ఉద్యోగం వాడు చేసుకొంటూవుంటే వాడికి సర్వీసెస్ చేసి తాను మధ్యని ఉండాలిట. పుట్టి, బుద్ధెరిగిన తరువాత ఎన్నడూ తాహతుకూ, అవసరానికీ మించి ఖర్చుచెయ్యలేదు. తన స్వంత పిల్లలక్కూడా ఒక బిస్కెట్ల ప్యాకెట్టు.ఒక వందగ్రాముల అంగూర్ ద్రాక్ష కొని ఇవ్వడం అనవసరం అనుకున్నవాడు ఆ

చేతులతోనే ఈ స్వాములందరికీ బోర్న్‌విటా, ఏపిల్సు అట్టే మాట్లా డితే ఫారిన్ విస్కీలు సప్లయ్ చేస్తున్నాడు. .ఇది టూ వే - ఎలా గైంది; త్రి-వే కదా అన్నా డతను.

'ఇదుగో చూడూ, వాసుదేవరావ్? టు-వే గానీ త్రి-వే గానీ; ఇందులో నీకు కీర్తి ఎలాగై తేలంటదో, తైలంకూడా అలాగే అంటు కోకూడదు;.... యింకా నీపోస్టు నయ్యం, గొయ్యిపడితే పూడ్చు కోడానికి పోర్సెసున్నాయి. మా డిపార్టుమెంటు తీసుకో-మావాళ్ళు ఎంతసేవూ తే.తే. అనడమేగాని ఈ వెధవలు ఎలా తెచ్చిపెడు న్నారు అన్న ఆలోచనే ఉండదు; మాకొక రీజినల్ జాయింట్ డైరెక్టరున్నాడు; ఆయనగారికి పన్నెండుమంది పిల్లలూ, పన్నెండు జిల్లాల జ్యూరీస్‌డిక్షనూనూ; ఆయనగారు ఏంచేస్తాడో తెలుసునా? గుంటూర్లో బయల్దేడుతాడు జీపులో పెళ్ళాన్నీ, ఆరుగురు పిల్లల్నీ ఎక్కించుకొని. ఈ వేపున్న ఆరు జిల్లాల్లో పదిహేనురోజులు టూర్ చేస్తాడు, మిగిలిన పదిహేన్రోజులూ పెళ్ళాన్నీ, మిగిలిన ఆరుగురు పిల్లల్నీ వేసుకుని, ఆవేపున్న ఆరు జిల్లాలూ టూర్ చేస్తాడు. ఇంత మందికీ, ఇన్నిచోట్లా ప్రతీనెలా సప్లయ్‌లు మేంచేసుకు పోవలసిందే; అలాచెయ్యకపోతే- ఏముంది; చెడపడానికి చేటపెయ్యచాలునన్న ట్లుగా ఎక్కడో వర్క్ బాగులేదంటాడు. అనేసి, శ్రీకాకుళంవాణ్ణి అనంతపురానికి, కర్నూలువాణ్ణి విశాఖపట్నానికి ట్రాన్స్‌ఫర్ చేస్తాడు. మొన్నామధ్య మా సూపర్‌వైజర్ ఒకడు ఈ ఖర్చులూ, నలుగురూ పోగేసుకుని బాధపడ్డంచూసి ఏడుపులో నవ్వు వెలగ బెడుతూ అన్నాడు? ఇలా ఆరుగురేసి పిల్లలతో ఒక్కసారిగా మీద పడి రోజుకి వందరూపాయలు ఖర్చు పెట్టించే బదులు; ఒక్కొక్క జిల్లాకి ఒక్కొక్క బిడ్డని చొప్పున పన్నెండు జిల్లాలకి పర్మనెంట్‌గా ఎలాట్ చేసేస్తే ఏదో చందాలు వేసుకునో, వంతులేర్పాటు చేసు

కొనో, ఆపిల్లల్నందర్నీ మన పన్నెండు జిల్లాల స్టాఫూ పోషించి పైకి తీసుకురాలేక పోతామా అని;.

వాసుదేవరావు ఆశ్చర్యపడ్డాడు ఈ కథ విని. అతనికి నవ్వుకూడా వచ్చింది. .ఎవరట్లా అన్నది. మొన్న సెంటర్లో మీతో మాట్లాడుతున్న క్రిష్ణమూర్తి గారేనా?అన్నాడు.

"ఇంకా నయం కాదూ! ఇంతమాట అని వాడింకా ఇక్కడ ఉండడమే? అతనిప్పుడు కడప జిల్లాలో ఏదో స్పెషల్ పోస్టులో అఘోరిస్తున్నాడు! .... అందుచేత —"

* * *

["డోన్ట్ బాదర్ ఫర్ ది ఛేన్జ్!"

* * *

"ఫరవా లేదుంచండి సార్ ! మేం మీకు ఇచ్చుకున్నదనగా యెంత ? మీ దయవల్ల మాకీ లైసెన్సొస్తే మీరే మాకు ఇంతకి నూర్రెట్లు ఇచ్చినట్లు !

* * *

"మొన్న గెస్టుహౌస్‌లో ఎరేంజ్‌మెంట్స్ తిన్నగా లేవని కలెక్టరుగారుకూడా పాయింటౌట్ చేసేరయ్యా !....జాగర్తగావుండు లేకపోతే నీ సొమ్మేం పోయిందిగాని మధ్యని మా వుద్యోగాలకీ, పరువుకీ యసరు !"

♦ ♦ ♦

"కొండంత దేముడికి కొండంత పత్రి ఇచ్చుకోగలమా. బాబూ ! బతుకే వొక గడ్డిపోచ అన్నాడు కవి. ఈ తృణం మా బ్రతుకుతో సమానం, ఇదే పదివేలనుకుని స్వీకరించండి బాబూ!"

*　*　*

"ఎప్పుడూ డబ్బు కర్చయి పోతున్నాదని గోలేనా, వెధవ గోలా నువ్వూను! హెడ్ క్వార్టర్స్ ఆరై అంటే మరేమిటనుకున్నావు? ఎన్నాళ్ళయినా కొత్తవదల్లేదేమిటి, నీకు? వెళ్ళు వెళ్ళు? కబుర్లతో కాలక్షేపం చెయ్యక తిన్నగా పని చూడు !"

*　*　*

"ఈ సాల్వెన్సీ సర్టిఫికెటు తమ రిప్పిస్తే మీపేరు చెప్పుకొని స్టేట్ బ్యాంకిలో లోను పెట్టుకుని మావాడు చిన్న బిజినెస్ పెట్టుకుని సెటిలవుతాడు. బతుకంతా బలాదూరుగా తిరిగి చెడిపోతున్నవాణ్ని ఓదార్లో పెట్టే ఖ్యాతి తమకి మిగుల్తుంది; మీ కలంపోటుతో వాక జీవితం నిలబడుతుంది. మీ కష్టం వుంచుకోం లెండి —!"]

*　*　*

ఈ రకం మాటలు వినడం అలవాటు చేసుకున్నాడు వాసు దేవరావు క్రమ క్రమంగా, అంతేకాక.

*　*　*

["నోనో – వీల్లేదండీ. క్షమించాలి ! మీరు చెప్పినట్టురాస్తే యింకేమన్నా ఉందా. అది ఎంత పెద్ద రిస్కో మీకు తెలియట లేదు .... భూమి మీ అక్రమణలో లేకుండా మీరు పట్టాకోసం ప్రయత్నిస్తున్నారు. మీ రాజకీయ నాయకులతో మీరు బాగానే ఉంటారు. ఎటొచ్చీ మమ్మల్నే బతకనియ్యరు. ఇటు ఊళ్ళోజనం, అటు ఆఫీసర్లూనూ ! కక్కుర్తిపడినా కడుపు నిండాలి కదండీ!.... మీరు చెప్పిన దగ్గర ఇప్పుడు ఎకరంనేల ఇరవైవేల రూపాయు లమ్ముతోంది. ఐదెకరాల పట్టా అంటే లక్షరూపాయలు ! మీరు నన్ను యాభై రూపాయలకి కొనాలని ట్రయ్ చేస్తున్నారు ఎందు

కండీ, పొసగని వ్యవహారం! ఒక్క అఫీసరు కేంపొస్తే నాకు రెండు వందలయిపోతుంది!"

* * *

"ఏమిటి సార్ ఈ డ్యూటీలు చచ్చిపోతున్నాను" క్షణంతీరిక లేదు, దమ్మిడీ ఆదాయంలేదూ అన్నట్టుగా ఉంది నాపని. ఆదాయం లేకపోతే పోయింది, ఖర్చో?.... ఆయనెవరో కలెక్టర్‌గారి ఫ్రెండట.యూనివర్శిటీలోఏదో వెల్లాళ్ళ పనిమీద వొచ్చాడట.తనకీ, తన అసిస్టెంట్సుకీ తన కుటుంబానికీ మెస్ పెట్టుకున్నాట్ట? వాళ్ళ మెస్సు కాదు గాని నా పనంతా మెస్ చేసేసేడు; పది కేజీల పంచదార పట్టుకెళ్ళి అక్కడ స్వయంగా వొప్పచెప్పమని ఆర్డరు. వాళ్ళ దగ్గర మనం డబ్బులు పుచ్చుకుంటామా సార్? ప్చ్ డబ్బులేముంది లెండి. ఇవ్వాళ ఖర్చు చేస్తాం రేపు భగవంతుడు మనకిస్తాడు!-ఎంత టైమ్ వేస్టండి, ఎంత ఎనర్జీ వేస్టు!"

"ఏదీ, సాల్వెన్సీ సర్టిఫికెట్టేగా; ఇద్దాం, ఇద్దాం! ఇంకామనం మీరుచెప్పిన ఆస్తి వివరాలు చెకప్ చెయ్యలేదు.... డాక్యుమెంట్ చూళ్ళేదు .... అందులో మా తాసిల్దారున్నాడే, ఇల్లు: అని అనే సరికి కండిషన్ రాయందే సాల్వెన్సీ నిర్ణయించొద్దని పేచీ పెట్టేస్తున్నాడు!.... టయిము రావాలి కదా?- చచ్చిపోతున్నానండీ తీరిక లేక, అన్నిటికీ ఒక్క రెవిన్యూ ఇన్‌స్పెక్టరు ఎక్కడ చస్తాడని ఒక్క ఆఫీసరుకీ కనికారం లేదు!.... మళ్ళీ కనిపించండి; మా ప్యూను గాడికి మీ ఇల్లు తెలుసుగా? ఎప్పుడో వీలు చూసుకుని వోమారు వస్తాలెండి .... ఆ వెధవ, మళ్ళా సమయానికి మీ ఇల్లు తెలీదంటాడేమో, కొంచెం వాడలా అనేయకుండా చూసుకోండి....ఆ తర్వాత నేనొచ్చి నిమిషాలమీద జరపవలసిన కార్యక్రమం అంతా జరిపించేస్తాను;....అలాగే అలాగే....దానికేం వుంది, నే చెప్తాగా!" ఈ

రకం మాటలు మాట్లాడడం కూడా నేర్చేసుకున్నాడు క్రమ క్రమం గానే.

* * *

"మీ దగ్గర్నుంచి ఉత్తరం లేకుండా మళ్ళీ మూడునెలలు గడిచిపోయాయి. నిన్న మీతో మాట్లాడదామని ట్రంక్ టెలిఫోన్ కాల్ బుక్ చేసేను పి. పి. (మనిషి) దొరకలేదన్నారు. ఈ టెలిగ్రాం చూసుకుని వెంటనే రండి, శుక్రవారం సాయంకాలంలోగా మీరు వుయ్యూరికి రాలేకపోతే శనివారం మెయిల్లో బయల్దేరి నేనే వచ్చేస్తున్నాను-

సులోచన."

"వెంటనే రండి" అని టెలిగ్రాం ఇద్దామని టెలిగ్రాఫాఫీసుకి బయల్దేరిన సులోచనకు అంత క్లుప్తంగా ఆఫీసర్‌గారి ఆర్డర్‌లా టెలిగ్రాం ఇవ్వడం అమానుషమని తోచింది. తనకెంతో వుత్కంఠగా ఉండొచ్చు ఆయన్ని అతి తొందరగా కలుసుకోవాలని. కసిగా ఉండొచ్చు అతనినిర్లక్ష్యంపట్ల. కాని ఇద్దరి మధ్య ప్రేమబంధం వాటన్నిటిని త్రోసివేయగలది.

"పదకొండు రూపాయల ఇరవై పైసలవుతుందమ్మా."

సులోచన పర్సుతీసి లెక్కపెట్టుకుంది. తొమ్మిది రూపాయల్నర వుంది.

"ఐదారు మాటలు తగ్గిస్తే సరిపోవచ్చునంటున్నాడు కిటికీ అవతలాయన.

కాని, ఆయనతో నేను మాట్లాడబోయిందే తక్కువ, నేనిచ్చే టెలిగ్రామే తక్కువ. ఇంకా ఎట్లా తగ్గించేది?" అనుకుందామె ఫారం తీసుకుని ఇవతలికొచ్చింది.

"హబీబూ! నీ దగ్గర రెండు రూపాయలుంటే ఇవ్వు. ఇంటి దగ్గరిస్తాను" అన్నది సులోచన అక్కడ కనబడిన పోస్ట్‌మేన్‌తో.

"జరూర్ తల్లీ-" అని ఉత్తరం, రెండు రూపాయలు ఇచ్చాడు పోస్ట్‌మేన్.

ఉత్తరం వాసుదేవరావునుంచి—

"నేను మీ గురించి అనుకున్నప్పుడే మీరూ నా గురించి అనుకున్నారు" అని ఉప్పొంగిన హృదయంతో ఉత్తరాన్నిముద్దు పెట్టుకుని విప్పింది సులోచన.

"కాని, ఉత్తరం తెరిచాక ఆమెకి చాలా నీరసం వచ్చేసింది-

"డియర్ సులోచన - నువ్వు కులాసా అనుకుంటాను. నీకు ఉత్తరం రాయలేకపోయాను. నిజం చెప్పలేక; అబద్ధం ఆడలేక—

"ప్రస్తుతం అనుకోని ఆపదలోపడ్డాను. ఇందులోంచి బయట పడినా, పడకపోయినా, మనం వెంటనే కలుసుకోవచ్చు. నేను ఇన్నాళ్ళూ ఏ విషయమైతే నీతో మాట్లాడడానికి సంకోచించానో అది నీకు తెలియ జేయగలిగే ధైర్యం నాకు కలుగుతోంది, అంతు లేని సత్యాలను చెప్పే జీవితం. సత్యం రహస్యం కాజాలదన్న సత్యాన్ని కూడా నాకు క్లిష్టతలేకుండా బోధపరుస్తూవుంది.

"ఈ ఉత్తరం నేను నీకు డబ్బు కోసం వ్రాయటంలేదు. అభిమానంకోసం, సానుభూతి కోసం వ్రాస్తున్నాను.

"రేపటి కోసం ఎదురుచూస్తూ.

— నీ వాసుదేవరావు"

గుండెల్లో మంట బయల్దేరింది సులోచనకి; పన్నెండు రోజుల క్రితం తేదీ వేసిన ఆ ఉత్తరాన్ని సాంతం చదివేసరికి.

ఏమిటి, ఆయన చిక్కుకున్న ఆపద ?

దొంగతనమా ! రంకుతనమా ?

కొట్లాటా, హత్యా ?

స్మగ్లింగా, బ్లాక్ మెయిలింగా ?

ఫోర్జరీయా. ఎమ్బెజల్మెంటా ?

ఎందులో ఇరుక్కున్నాడు ?

రహస్యం - సంకోచం - సత్యం - జీవితం - క్లిష్టత — సానుభూతి —

పదజాలమే కొత్తగా వుంది. ఎదిగినవాడి పదును కనబడు తోంది —

ఎదిగాడా దిగజారేడా ?

"సానుభూతి కోసం రాస్తున్నాను." అని రాశాడు -

ఇంకొక టెలిగ్రాం ఫారం తీసుకొంది సులోచన.

"కష్టాలు కలకాలం వుండవు, ధైర్యంగా ఉండడి -

సులోచన"

* * *

గుండెల్లో బరువును గుండెల్లో అణచివేసింది సులోచన. అందుచేత కాబోలు. గుండెలర చేతుల్లో పెట్టుకుని తండ్రిగారింటికి చేరింది.

"అమ్మా ! ఇదేమిటి ఘోరం, చూడూ" అంటూ ఇంటికి చేరగానే తండ్రిగారు వార్తాపత్రిక అందజేశారు. ఘోరం అన్న మాటకి భయపడటం మానేసి చాలా రోజులైంది. కాని తండ్రిగారి

కంట్లో గిర్రున తిరిగిన చెమ్మచూసి. ఇదేదో ఘోరమే అయి వుంటుందని వణుకు పుట్టింది. సులోచనకు కొన్ని క్షణాలపాటు పేపరు చూడటానికే బుద్ధిపుట్టలేదు; చేతిలోకి తీసుకొన్నాకూడాను.

సుఖాన్ని ఇతరులతో పంచుకోవడము, కష్టాన్ని తానే దిగ మింగుకోవడమునేర్చిన సులోచన. ఆ నిమిషంలోనే మళ్ళీ తానై పోయింది.

"విశాఖపట్టం; ఆగస్టు 27 .... రివిన్యూ డిపార్ట్‌మెంటుకు చెందిన వాసుదేవరావనే ఉద్యోగి వేయిసిమెంటు బస్తాలకు పర్మిట్ ఇప్పిస్తానని ఒక ఆసామినీ నమ్మించి, అతనివద్ద పదిహేనువందల రూపాయలు లంచంగా పుచ్చుకొన్నాడని రుజువుకాగా. సదరు వాసుదేవరావును ఉద్యోగంనుంచి బర్తరఫ్ చేయడమేకాక, అతనికి రెండేళ్ళ కఠినశిక్ష విధిస్తూ ఈ రోజున .... తీర్పు చెప్పారు. ఈ కేసును .... నిర్వహించారు."

---

● కఠినశిక్ష - అనేది Rigorous Imprisonment కితెలుగు రాష్ట్రస్థాయిలో రెవిన్యూ డిపార్ట్‌మెంటు, ప్రభుత్వ శాఖలో అతి ప్రముఖమైనది, ఈ శాఖలో Revenue inspector (రెవిన్యూ ఇన్‌స్పెక్టర్) అనేది ఒక ఉద్యోగం పేరు. రూల్సు ప్రకారం ఈ ప్రభుత్వశాఖలో చేరిన ప్రతి వ్యక్తి ఉన్నతోద్యోగానికి ప్రమోషన్ పొందాలంటే కనీసం రెండేళ్ళపాటు రెవిన్యూ ఇన్‌స్పెక్టర్‌గా (R. I. గా) పనిచెయ్యాలి. లేకపోతే, ఆ వ్యక్తికి ఎంత సర్వీసు వున్నా.ఎన్ని పరీక్షలు పాసయివున్నా సరే ప్రమోషన్ ఉండదు. ఈ R. I. ఉద్యోగ కాలం రెండేళ్ళనీ, "R. I. కోర్సు" అని. Cour-

rse of Rigorous Imprisonment" అనే అర్థం. వ్యంగ్యంగా స్ఫురించేటట్టుగ ఆ శాఖలోని ఉద్యోగులు వాడుతారు. "ప్రమోషన్ వచ్చిందా అంటే, "ఏదీ ఇంకా R. I. కోర్సు కాందే" అని; "నీ R. I. కోర్సు ఎక్కడ గడిచింది" అనీ. అలాగ.